క్లుప్తంగా

దాసాంజనేయుడికి సిందూర అర్చనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, సిందూర అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహనాలకు పూజలు చేయించుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

9న నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని యజమాన్యాల పరిధుల్లో ఉన్న (ప్రభుత్వ, ప్రైవేట్, మున్సిపల్, ఎయిడెడ్) పాఠశాలలో ఈ నెల తొమ్మిదో తేదీన నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జరిగే నులిపురుగుల మందుల పంపిణీని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి తహేరాసుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికీ మందులు అందజేస్తారని పేర్కొన్నారు. పాఠశాలల యజమాన్యాలు, అధికారులు సూచించిన పిల్లలు నులిపురుగుల మందు వేసుకొనేట్లు చూడాలని కోరారు.

వేగంగా రోడ్డు నిర్మాణ పనులు



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు ఎయిర్‌క్వాలీటీ ఇంప్రూవ్‌మెంట్ గ్రాంటు రూ. 9 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. జక్కంపూడి రోడ్డు సరిహద్దు నుంచి పైపులరోడ్డు వరకు రూ. 4.5 కోట్లు, కండ్రిక జంక్షన్ నుంచి గుణదల వైపు వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులకు రూ. 4.5 కోట్లు.. రెండు ఎస్టిమేట్లతో బీటీ రోడ్ల అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు నగరపాలకసంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాస్ తెలిపారు. భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్‌తో ఉండే ఈ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం రహదారిపై ఎయిర్‌పొల్యూషన్ ఇంప్రూవ్‌మెంట్ కోసం ప్రత్యేకంగా మంజూరు కాబడిన గ్రాంటుతో రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఈఈ తెలియజేశారు. ప్రస్తుతం జక్కంపూడి నుంచి పైపులరోడ్డు వరకు పనులు ప్రారంభించారు. ఈ పనులు ముగిసిన వెంటనే కండ్రిక జంక్షన్ నుంచి పనులు ప్రారంభిస్తారు.

వార్డు సచివాలయం సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వార్డు సచివాలయం సేవలు సద్వినియోగం చేసుకోవాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో మంగళవారం వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలు, వార్డు సచివాలయ సేవలను వివరించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, నాయకులు వెంకటరెడ్డి, అంగిరేకుల విజయ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బాలికకు పెళ్లి యత్నాలపై కేసు నమోదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బాలికకు మేనమామతో బలవంతంగా పెళ్లి యత్నాలు చేస్తున్నారంటూ మంగళవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. గుణదల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భానూనగర్‌కు చెందిన రాళ్లపూడి అప్పన్న తాపీ మేస్త్రిగా పని చేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె(14)కు అప్పన్న భార్య తన తమ్ముడితో వివాహం చేయాలని పట్టుబట్టింది. కుమార్తె, అప్పన్న వివాహానికి అంగీకరించకపోవడంతో భార్య తరపు వారు వచ్చి ఎందుకు వివాహం చేయరంటూ బలవంతం చేశారు. దీంతో బాలిక తండ్రి అప్పన్న గుణదల పోలీసులను ఆశ్రయించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి పట్టా.. పక్కా..

- నందమూరినగర్‌లో 70 కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడానికి క్యాబినేట్ ఆమోదం
- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఎం
- సంబరాలు చేసుకుంటున్న నిరుపేద కుటుంబాలు



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజకు కృతజ్ఞతలు తెలుపుతున్న నందమూరినగర్ ప్రాంత ప్రజలు (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వారంతా అతి సామాన్య, నిరుపేద కుటుంబాలకు చెందిన వారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. సుమారు నాలుగు దశాబ్దాల నుంచి నివసిస్తున్న తమ ఇళ్లకు ఇంటి పట్టాలు ఇప్పించాలంటూ ప్రతీ ప్రభుత్వం లోనూ అభ్యర్థనలు చేస్తూనే ఉన్నా ఏ ఒక్కరూ వీరి 'గూడు' గోడును పట్టించుకున్న వారులేరు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పేద ప్రజల చిరకాల కోరిక అయిన ఇంటి పట్టాల కల సాకారమైంది. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వీరి సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఇళ్ల పట్టాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టాలు

సింగ్‌నగర్ 58వ డివిజన్ పరిధిలోని నందమూరినగర్ ప్రధాన రహదారి వెంబడి 70 కుటుంబాలు ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నాయి. అయితే ఈ ఇళ్లకు ఎటువంటి పట్టాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వందల సార్లు అప్పటి నాయకులకు విన్నవించినా ఒక్కరు కూడా పట్టించుకోలేదు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ కార్పొరేటర్‌గా పోటీ చేసిన డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ఎన్నికల సమయంలో మీ అందరికీ పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఇళ్ల పట్టాల సమస్యను కలెక్టర్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకువెళ్లారు. ఇదే అంశాన్ని వారు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే విష్ణు ఈ ఇంటి పట్టాల విషయంపై అసెంబ్లీలో కూడా గతంలో మాట్లాడారు. తాజాగా సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును కలిసి డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నందమూరినగర్ ప్రాంత ప్రజలు సమస్యను వివరించారు. వారి సమస్యలను ఆలకించిన వెలంపల్లి ఈ డెబ్బై కుటుంబాల ఇంటి పట్టాల విషయాన్ని సీఎం వైఎస్ జగన్ వద్దకు తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. దీంతో సీఎం జగనన్న సానుకూలంగా స్పందించి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్ర క్యాబినేట్ ఆమోదం తెలిపింది.

ప్రతి ఇంటా ఆనందం

సెంట్రల్ ఇన్‌చార్జ్‌గా వచ్చీరావడంతోనే తమ చిరకాల కోరికను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తీర్చడంతో నందమూరినగర్ ప్రాంత ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల స్వప్నాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా జీవితాంతం రుణపడి ఉంటామని చెబుతున్నారు.

సంతోషంగా ఉంది



నాలుగు దశాబ్దాల పైనుంచి ఇక్కడే జీవిస్తున్నాము. వచ్చిన ప్రతీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఏదో హామీ ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేసేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం మాకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. మా చిరకాల కోరిక తీరడంతో చాలా సంతోషంగా ఉంది.

-సీహెచ్ దుర్గా, స్థానికురాలు.

ఆశ్చర్యాన్ని కలిగించింది



ఎన్నో ప్రభుత్వాలు ఇలానే మాటలు చెప్పి వదిలేయడంతో వైఎస్సార్ సీపీ వాళ్లు కూడా అలానే వట్టి మాటలు చెప్పి వెళ్లిపోయారని అనుకున్నాము. కానీ మా సమస్యను మేము మర్చిపోయినా డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యేలు వదలకుండా సమస్యను పరిష్కరించడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. నిరుపేదల కోసం నిజంగా ఆలోచన చేసే గొప్ప ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.

-జి.కృష్ణకుమారి, స్థానికురాలు

జగనన్న వెంటే ఉంటాం



దాదాపు నలభై ఏళ్ల నుంచి ఇక్కడే నివసిస్తున్నాము. మా ఇళ్లను ఇక్కడి నుంచి తొలగించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో ప్రయత్నాలు కూడా చేశారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు అండగా నిలబడి ఇంటిపట్టాలు ఇచ్చేందుకు ఆమోదం తెలపడం గొప్ప విషయం. మేమంతా జగనన్నకు తోడుగా నిలబడతాము.

-సత్యనారాయణరాజు, స్థానికుడు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



భవానీపురం(విజయవాడపశ్చిమ): విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని నగరపాలకసంస్థ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు తమ తమ సమస్యలను కమిషనర్‌కు వివరించారు. స్పందించిన ఆయన ఆయా సమస్యలన్నింటికి పరిష్కారాలు చూడాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఫారం 6, 7, 8 దరఖాస్తుల గురించి పొలిటికల్ పార్టీల ప్రతినిధులకు వివరించారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఎటువంటి తప్పులు ఉండకూడదని, అలాగే ఎలాంటి సమస్యలు తలెత్తకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో గుండె సుందర్‌పాల్(వైఎస్సార్ సీపీ), నవనీతం సాంబశివరావు(టీడీపీ), ఎం వినోద్‌కుమార్(బహుజన సమాజ్ పార్టీ), ఎన్ వీరభద్రరావు (సీపీఐ), సీహెచ్ శ్రీనివాస్(సీపీఐ మార్కిసిస్ట్), నగరపాలక సంస్థ సీపీ జీవీజీఎస్‌వీ ప్రసాద్, సెంట్రల్ తహసిల్దార్ వెన్నెల శ్రీను, డెప్యూటీ తహసిల్దార్ సురేష్‌కుమార్, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు

సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు



స్థానికులను సంక్షేమ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో ఏ డివిజన్‌కు వెళ్లినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు సంతృప్తి స్థాయిలో అందుతున్నాయని.. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి ఆయన సత్యనారాయణపురంలోని పలు వీధుల్లో పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధిపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఈ డివిజన్‌లో ఒక్క అభివృద్ధి పనికూడా చూసిన పాపాన లేదని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ శర్వాణీమూర్తిల కృషితో డివిజన్‌లోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించారని, ఎటైనా సమస్య ఉంటే తక్షణమే వాటిని పరిష్కరించి తమ ఇబ్బందులు తొలగించేవారని స్థానికులు వెలంపల్లి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమత, రాజకీయాలకు అతీతంగా అర్హతే కొలమానంగా ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజల మనసులను గెలుచుకున్న నాయకుడికి ఎప్పుడూ ఓటమి ఉండదని రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించనుందని పేర్కొన్నారు.

సెంట్రల్‌లో 25 వేల మెజార్టీతో గెలుపు

గత ప్రభుత్వంలో సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే బొండా ఉమా ఏ ఒక్క డివిజన్‌లోనూ అభివృద్ధి చేసింది లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయాలతో సెంట్రల్‌లోని ప్రతీ డివిజన్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలైన పాలన అందించడం జరిగిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో 25 వేలకు పైగా మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాసరావు, నాయకులు మైలవరపు రామకృష్ణ, శనగవరపు శ్రీనివాసరావు, కొల్లూరి రామకృష్ణ, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా జగనన్న ప్రభుత్వం



ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ఆటో కార్మికులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నున్న గ్రామంలో మంగళవారం జరిగిన రైల్వే ఆటో వర్కర్స్ యూనియన్ వనభోజనాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ రేయింబవళ్లు కష్టించి పని చేసే ఆటో కార్మికులంటే తనకి అపార గౌరవమని పేర్కొన్నారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్‌తో తనకి విడదీయరాని బంధం ఉన్నట్లు వెల్లడించారు. ఆటో డ్రైవర్ల కష్టాలు, బాధలు స్వయంగా పాదయాత్ర ద్వారా గమనించిన సీఎం వైఎస్ జగన్ వారిని ఆదుకునేందుకు వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే వాహనమిత్ర పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఒక్క సెంట్రల్ నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు ఐదు విడతల ద్వారా 2,265 మందికి రూ. 10 కోట్లు అందజేసినట్లు తెలిపారు. వాహనాల ఇన్స్యూరెన్స్, రిపేర్ ఖర్చులకు దోహద పడాలన్నదే జగనన్న ఆకాంక్ష అని చెప్పారు. అలాగే యూనియన్ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు తాను సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● అభినందన



కాపు వెల్ఫేర్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన చింతా శ్రీనివాసరావును మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీహెచ్ఎస్వీ జానారెడ్డి, ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యుడు అలీమ్, నేతలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు అభినందించారు.

-అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)

జగనన్న పాలనలో ప్రజా సమస్యలకు పరిష్కారం



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతోందని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ అన్నారు. స్థానిక 64వ డివిజన్ కేర్ అండ్ షేర్ స్కూల్ వద్ద మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 19.50 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక దఫాలుగా రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు విన్నవించుకున్నా పాలకులు పట్టించుకోలేదని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో డివిజన్‌లో అనేక రోడ్లు వేశామని తెలిపారు. త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, కొక్కిలిగడ్డ నాని, వెంకటేశ్వరమ్మ, కుమారి, కిరణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయి లక్ష్మీ, అక్కిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధుర స్వరాల శాల ఘంటసాల



విజయవాడ కల్చరల్: మధుర స్వరాల శాల ఘంటసాల అని డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం ఘంటసాల గానామృతం-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన నరసింహారావు ఘంటసాల సేవలను వివరించారు. విశ్వమాతా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు వారి గుండె చప్పుడు ఘంటసాల అని అభివర్ణించారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ ఘంటసాల గాన మాధుర్యం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి, గాయనీ గాయకులు విష్ణుభొట్ల విష్ణుప్రియ, కొప్పుల ఆనంద్, ఉమాబలరాం పలు ఘంటసాల గీతాలను ఆలపించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులే



మొబైల్ కోర్టులో విచారణ జరుపుతున్న న్యాయమూర్తి


భవానీపురం(విజయవాడపశ్చిమ): సర్కిల్-2 కార్యాలయంలో జరిగిన మొబైల్ కోర్ట్‌లో 9 కేసులు నమోదయ్యాయి. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు రోడ్లపైన చెత్త వేసినవారికి, నిబంధనలను ఉల్లంఘించిన వారికి ప్రతి మంగళవారం నిర్వహించే మొబైల్ కోర్ట్‌లో భాగంగా కార్పొరేషన్ కోర్ట్ న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి మంగళవారం మొబైల్ కోర్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై చెత్త వేసినందుకు, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించినవారికి సర్కిల్-2 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 9 కేసులపై విచారణ జరిపి రూ.2,680 జరిమానా విధించారు. ఒకసారి జరిమానా విధించినా రెండో సారికూడా అదే తప్పు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని న్యాయమూర్తి హెచ్చరించారు. అంతే కాకుండా ప్రజలుకానీ వ్యాపారస్తులుకానీ మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘిస్తే మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, మహిళా సాధికార విభాగం ఆధ్వర్యాన సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ జీ హిమబిందు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సర్వైకల్ క్యాన్సర్ అనేది గర్భాశయంలోని కణాలకి వచ్చే ఒక రకమైన క్యాన్సర్ అని అన్నారు. లైంగికంగా సంక్రమించే ఇన్ఫెక్షన్ హ్యూమన్ పాపిల్లోమా వైరస్(హెచ్‌పీవీ)కి సంబంధించిన వివిధ జాతులు సర్వైకల్ క్యాన్సర్‌కు కారణమవుతాయన్నారు. స్క్రీనింగ్ టెస్ట్, హెచ్‌పీవీ ఇన్ఫెక్షన్ నుంచి రక్షించే వ్యాక్సిన్‌ని తీసుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చునని తెలిపారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నీరజ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ ఏ లావణ్య, అధ్యాపకులు పీ ధనలక్ష్మి, కే సుధారాణి, పీ సత్యవాణి, డీ నాగలక్ష్మి, సుమిత్ర పాల్గొన్నారు.

మానవాళిని రక్షిస్తున్న మరియమాత



గుణదల (విజయవాడ తూర్పు): తన ప్రార్థనా విజ్ఞాపనల ద్వారా మానవాళిని రక్షిస్తున్న మరియ తల్లిని లోకమాతగా కీర్తిస్తున్నారని హైదరాబాద్ పునీత యోహాను గురు విద్యాలయ రెక్టర్ ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనల్లో ఏడో రోజైన మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల జనులకు దీవెనల మాతగా గుణదల లూర్దు మాత కొలువై నిలిచిందన్నారు. దేవుని రక్షణ ప్రణాళికలో భాగంగా మరియ మాత లోక రక్షకుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి అందించిందని తెలిపారు. దేవునిపై విశ్వాసముంచి రక్షణ మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనుదిన ప్రార్థన, బైబిల్ పఠనంతో ఆధ్యాత్మిక జీవనం గడపాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, ఫాదర్ గాబ్రియేల్, ఫాదర్ చిన్నప్ప తదితరులు హాజరయ్యారు.

రన్నింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించండి

ఏఐఎల్ఆర్ఎస్ఏ జనరల్ సెక్రటరీ జేమ్స్



మాట్లాడుతున్న కేసీ జేమ్స్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేలో రన్నింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) జనరల్ సెక్రటరీ కె.సి. జేమ్స్ డిమాండ్ చేశారు. ఏఐఆర్ఎస్ఏ దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్ డివిజన్ కమిటీల ఆధ్వర్యాన విజయవాడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో 'రన్నింగ్ స్టాఫ్‌పై పనిభారం - ప్రయాణికుల భద్రతకు ముప్పు' అనే అంశంపై సెమినార్ జరిగింది. జేమ్స్ మాట్లాడుతూ సురక్షితమైన రైళ్ల నిర్వహణకు లోకో పైలట్ల పాత్ర కీలకమన్నారు. వీరు విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై పలు డివిజన్ల నేతలు సెమినార్‌లో చర్చించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానించుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రన్నింగ్ సిబ్బందికి 8 గంటల పని దినం, రెండు రాత్రులకు మించి నైట్ డ్యూటీలు వెయ్యరాదని, సెలవులు, సిక్ లీవ్‌లు క్రమం తప్పకుండా అమలు చేయాలని, లోకోమోటివ్‌లో టాయిలెట్‌లు, టూల్స్, ఏసీ సదుపాయాలు కల్పించడానికి రైల్వేశాఖ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, ఏఐఎల్ఆర్ఎస్ఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల చంద్రన్, జోనల్ ప్రెసిడెంట్ ఎస్‌కే చౌబే, డివిజనల్ సెక్రటరీ కె.రామకృష్ణ, పలు డివిజన్ల లోకో పైలట్‌లు పాల్గొన్నారు.